## చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

శేరిలింగంపల్లి, జూన్ 22: విద్యార్థులకు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విస్టా ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ వెల్లంకిరావు అన్నారు. శనివారం గోపన్‌పల్లిలోని విస్టా ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ మేరీ శాంతిప్రియ పాల్గొన్నారు.

## పార్కులో అసంపూర్తి పనులు పూర్తి చేయిస్తా

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావును కలిసిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 22: కేపీహెచ్‌బీ కాలనీ 1, 2 ఫేజ్‌లలోని నేతాజీ పార్కులో అసంపూర్తి పనులను పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యేను కేపీహెచ్‌బీ కాలనీ 1, 2వ ఫేజ్‌ల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు కలిసి.. కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలోని పార్కులో పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటానని, ప్రైవేట్ హాస్టల్స్‌లో ఎదురయ్యే సమస్యలు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు సాంబయ్య, హేమ సుందర్, శ్రీకాంత్‌రెడ్డి, బాపురెడ్డి, చారి, కొండరెడ్డి, లక్ష్మారెడ్డి, రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

## కలుషిత జలాలను అరికట్టాలి

**ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్**

నేతాజీకాలనీలో కలుషిత జలాల సరఫరాను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీశ్

బాలానగర్, జూన్ 22:కలుషిత జలాలను అరికట్టడంలో జలమండలి అధికారులు విఫలమవుతున్నారని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని నేతాజీకాలనీ జాన్సన్ గ్రామర్ స్కూలు వీధిలో కాలనీవాసులతో కలిసి ఆయన పర్యటించారు. కాలనీవాసులను కలుషిత జలాలపై వివరణ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వారం రోజులుగా కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని స్థానికులు ఫిర్యాదులు చేసినా జలమండలి అధికారులు స్పందించకపోవడం బాధాకరం అన్నారు. కలుషిత జలాలు తాగి ప్రజలు అనారోగ్యానికి గురైతే జలమండలి అధికారులే బాధ్యత వహించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

## నాలా పూడికతీత పనులను సమగ్రంగా చేపట్టాలి

నాలా పూడికతీత పనులను సమగ్రంగా చేపట్టాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్ నుంచి బొజై గార్డెన్ వరకు చేపట్టిన నాలా పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం సందర్భంగా నాలాలను సమగ్రంగా పూడికతీయాలని సూచించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నాలా పూడికతీత చేపట్టాలని సూచించారు. – బాలానగర్, జూన్ 22

## నోట్ బుక్స్, స్టేషనరీ వితరణ

కొండాపూర్, జూన్ 22 : కొండాపూర్ డివిజన్ సిద్ధిక్‌నగర్‌కు సంతోష్ తన కూతురు విఖిత పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీని శనివారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ రమేశ్, ఉపాధ్యాయులు పీరోజీ, భాస్కర్, ప్రతిభ, శ్రీను, తేజ, మాధవి, రేణుక, విశాలి, అఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులతో న్యూకాలనీగా తీర్చిదిద్దుతా

మియాపూర్, జూన్ 22:మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూకాలనీలో సమస్యల పరిష్కారంతోపాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఈఈ రాజు, డీజీఎం నాగప్రియ, మేనేజర్ సునీత, ఏఈ దుర్గా ప్రసాద్‌లతో కలిసి బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ శనివారం పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో నవీన్, లింగయ్య, కనక రాజు, మహేశ్, లక్ష్మణ్ రాజు, లావణ్య, వరలక్ష్మి, తిమ్మరాజు, నరేశ్ నాయక్, వెంకటేశ్ గౌడ్, దుర్గేశ్, శంకర్, రాజు, రాజేశ్, శ్రీశైలం, రవి, అశోక్, జ్యోతి, లక్ష్మీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

**దోమల నివారణకు చర్యలు..**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువులో దోమల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఎంటమాలజీ ఆధ్వర్యంలో ఎల్లమ్మ చెరువులో దోమల నివారణ మందులను శనివారం పిచికారి చేయించారు. సమ్మారెడ్డి, షౌకత్ అలీమున్నా, విష్ణు, వెంకట్‌రెడ్డి, ఎంటమాలజీ, నర్సింహులు పాల్గొన్నారు.

## రాంగ్‌డ్రైవింగ్.. 18 మందిపై కేసు

మియాపూర్, జూన్ 22:మియాపూర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్ నిరోధంపై శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బాచుపల్లి రోడ్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ, కోకోకోల కూడలి వద్ద ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, ఆర్ఐ అనీల్, ఎస్ఐ సుభాష్‌లు సిబ్బందితో డ్రైవ్ చేపట్టి యూటర్న్‌ల వద్ద రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న 18 వాహనాలను పట్టుకుని ఫైన్ వేయడంతోపాటు వాహనదారులపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు.

## ట్రాన్స్‌జెండర్ల బైండోవర్

మాదాపూర్, జూన్ 22: లేట్ హౌజ్ వద్ద న్యూసెన్స్‌కు పాల్పడుతున్న ట్రాన్స్‌జెండర్లను మాదాపూర్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం ... మాదాపూర్‌లోని ఐకియా ఫ్లై ఓవర్ వద్ద ఉన్న లేట్ హౌజ్‌లో ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు న్యూసెన్స్‌కు పాల్పడుతుండటంతో లేట్‌హౌజ్ మేనేజ్‌మెంట్ ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శేరిలింగంపల్లి ఎంఆర్‌ఓ కార్యాలయంలో సత్ప్రవర్తన నిమిత్తం వారిని అప్పగించారు.

## బహిరంగ మద్యపానంపై చర్యలు

జగద్గిరిగుట్ట, జూన్22 : బహిరంగ ప్రదేశాల్లో మద్యం, ఆకతాయి పనులకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సీఐ క్రాంతి కుమార్ హెచ్చరించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో శనివారం స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. జగద్గిరిగుట్ట బస్టాప్, ఆస్‌బెస్టాస్ కాలనీ పార్క్, గుబురుగుట్ట, సిక్కుబస్తీ, ఎల్లమ్మ బండ చెరువు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. గుమికూడి మద్యం తాగుతున్న పలువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. బెల్టుషాపులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ల ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇద్దరిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదు

దుండిగల్, జూన్ 22: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ సాయియాదవ్(ఏ2), అడవి కిరణ్‌సాయి(ఏ1)పై ల్యాండ్‌గ్రాబింగ్ కేసు నమోదు అయ్యింది. గండిమైసమ్మ–దుండిగల్ గిర్దావర్ ప్రదీప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గత నెల(మే) 30వ తేదీన పోలీసులు కౌన్సిలర్‌పై ప్రభుత్వ భూముల ఆక్రమణ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... గండిమైసమ్మ–దుండిగల్ మండలం,గండిమైసమ్మలోని సర్వే నంబర్ 120 ప్రభుత్వ భూములతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడం, రాత్రికి రాత్రే గదుల నిర్మాణం చేపట్టడం, అమాయకులకు విక్రయించడంలో ప్రముఖ పాత్ర వహించినట్లు గుర్తించిన మండల రెవెన్యూ అధికారులు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వయంగా మండల గిర్దావర్ ప్రదీప్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కౌన్సిలర్ సాయి యాదవ్‌పై ఐపీసీ 447, 427, 186, ఆర్/డబ్యూ 34 ఐపీసీ, పీడీపీపీఏ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డీ.పోచంపల్లి,సర్వేనంబర్ 119,ప్రభుత్వ అసైన్డ్ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు శనివారం కూల్చి వేశారు. అదే విధంగా దుండిగల్ గ్రామ పరిధిలోని పల్లవి ఆశ్రమం సమీపంలోని ప్రభుత్వ స్థలంలో వెలసిన మరో నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చేసినా, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టినా సహించేది లేదన్నారు. అవసరమైతే నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# కాలనీలను అభివృద్ధి పథంలో నడిపిస్తా

**■ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**

ఎమ్మెల్యే గాంధీతో ఆలిండ్ ఎంప్లాయీస్ కాలనీ, సుదర్శన్‌నగర్ వాసులు

మియాపూర్ , జూన్ 22 : కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కాలనీ ప్రజలను భాగస్వాములను చేస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ ఆలిండ్ ఎంప్లాయీస్ కాలనీ, సుదర్శన్‌నగర్ కాలనీలలో నెలకొన్న సమస్యలతో పాటు చేపట్టాల్సి అభివృద్ధి పనులపై కాలనీ వాసులు ఎమ్మెల్యే గాంధీని శనివారం ఆయన నివాసంలో కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో కోట్లాది నిధులు వెచ్చించి తగినన్ని తాగునీటి రిజర్వాయర్ల నిర్మాణం, పైప్‌లైన్ల విస్తరణ చేపట్టామన్నారు. వ్యవస్థను సద్వినియోగం చేసుకుని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. మరింత మెరుగైన తాగునీటి సరఫరాకు యుద్ధప్రాతిపదిన చర్యలు చేపట్టాలన్నారు. కాలనీలో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పిస్తామని, అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సత్యనారాయణ, సత్యం, జీవరత్నం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాంరెడ్డి, సాయిరెడ్డి, సాయిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రకాశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

– వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీలో వినాయక పార్కులో తన సొంత నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న లిఫ్ట్ పనులకు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భవనానికి వచ్చే వృద్ధుల సౌకర్యం కోసం లిఫ్ట్ వసతిని కల్పిస్తున్నట్లు, వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు.కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, రాంచందర్, వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రెడ్డి, జగదీశ్ పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల విక్రేతతోపాటు వినియోగదారుడు అరెస్టు

మాదాపూర్, జూన్ 22: మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం ... ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన గోసంగి వెంకట సాయి చరణ్ (25) బెంగళూరులో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. తక్కువ సమయంలో డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో చిన్న చిన్న పేపర్ బాక్సుల్లో తక్కువ మొత్తంలో ఎండీఎంఏ ప్యాకింగ్ చేసి కవరులో పెట్టుకొని బెంగళూరు నుంచి వెళ్లే ప్రైవేట్ ట్రావెల్ బస్సుల డ్రైవర్లకు రూ.100 ఇచ్చి వారి చిరునామాలకు చేరుకునేలా బెంగళూరు కేంద్రంగా నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, వైజాగ్ వంటి ప్రాంతాల్లో డ్రగ్‌ను సరఫరా చేస్తూ విక్రయించేవాడు. హైదరాబాద్‌లోని డ్రగ్ వినియోగదారులు మార్నింగ్ స్టార్ ట్రావెల్స్, జీవీఆర్ ట్రావెల్స్, రాజేశ్వరి ట్రావెల్స్, చెర్రీట్రావెల్స్ ద్వారా డ్రైవర్ల నుంచి నేరుగా సేకరించేవారు. పోలీసులు అందుకున్న విశ్వసనీయ సమాచారం మేరకు వెంకటసాయి చరణ్ రెగ్యులర్ కస్టమర్లకు డ్రగ్ సరఫరా చేయడానికి హైదరాబాద్ వచ్చినప్పుడు అతని వద్ద 12.72 గ్రాముల ఎండిఎంఏ ఉన్నట్లు గుర్తించి యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 50 మంది కస్టమర్లను గుర్తించినట్లు తెలిపారు. ఇందులో ముఖ్యంగా పశ్చిమ గోదావరికి చెందిన మల్లిక్ లోకేశ్ (25) వ్యాపారం చేసేందుకు మాదాపూర్‌కు వలస వచ్చాడు. నెల్లూరుకు చెందిన సందీప్‌రెడ్డి(30)మాదాపూర్‌లో నివాసం ఉండేవాడు. బండ్లగూడ జాగీర్‌కు చెందిన రాహుల్(30) కూకట్‌పల్లిలో, పశ్చిమ గోదావరికి చెందిన సుబ్రహ్మణ్యం (25) సనత్‌నగర్‌లో నివాసం ఉంటూ డ్రగ్ కొనుగోలు చేస్తూ ఉండేవారు. అనంతరం ఇందుకు సహకరించిన ట్రావెల్ బస్సులకు నోటీసులు అందజేస్తామని, అనధికారికంగా ఏదైనా పార్శిళ్లను స్వీకరిస్తే బస్సులను సీజ్ చేయడంతోపాటు ట్రావెల్స్‌పై కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలని, విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడటం అటువంటి వారు ఎవరైనా ఉంటే 87126 71111 గల నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ఇదిలా ఉండగా నిందితుల వద్ద 12.72 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, సెల్‌ఫోన్లు 1, రూ.1.53లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కొండాపూర్, జూన్ 22 : అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చందానగర్ హుడా కాలనీ సాయిబాబా దేవాలయం వెనకాల ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ(40) మృతదేహం పడి ఉన్నట్లు గుర్తించారు. మహిళ ఒంటిపై నలుపురంగు చీర, నలుపు రంగు జాకెట్ ధరించి ఉన్నది. ఎడమ చేతిపై బాలయ్య అని పచ్చబొట్టు ఉన్నట్లు గుర్తించారు. కాగా, మహిళ మెడలోని స్కార్ఫ్‌తో గొంతు నులిమి హత్య చేసి ఉంటారని ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు హత్య కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గెలుపునకు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు

**మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**

అభినందన సభలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

దుండిగల్,జూన్22:ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ప్రగతినగర్‌లోని పుచ్చలపల్లి లీలాసుందరయ్య ఫంక్షన్‌హాల్‌లో శనివారం స్థానిక బీజేపీ ఆధ్వర్యంలో ఈటలకు అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను డివిజన్‌ల వారీగా కార్యకర్తలు, నేతలు శాలువాలు, పూలబొకేలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. తాను కొందరి వాడిని కాదని, అందరివాడినని పేర్కొన్న ఆయన పార్టీలకు అతీతంగా తన గెలుపునకు చాలా మంది కృషి చేశారని, వారందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎల్లప్పుడు ముందుంటానని పేర్కొన్న ఆయన ప్రగతినగర్‌లోని అంబీర్‌చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డా.ఎస్.మల్లారెడ్డి, గిరివర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ జేకే.శేఖర్‌యాదవ్, నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు ఆకుల సతీశ్, కార్పొరేటర్ విజయలక్ష్మి, ఎంఆర్‌పీఎస్ నాయకులు సంజీవరావుతో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి


కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణను కలిసిన ప్రజలు

దుండిగల్,జూన్22: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద శనివారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్ దృష్టికి వెళ్లి పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఆయన ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

## శివశివానికి అంతర్జాతీయ గుర్తింపు

కుత్బుల్లాపూర్,జూన్ 22 : కొంపల్లి శివశివాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యా సంస్థకు అసోసియేషన్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సౌత్ ఇండియా ద్వారా ప్రతిష్ఠాత్మకమైన ఎస్‌ఎక్యూఎస్ ఇంటర్నేషనల్ అక్రిడేషన్ గుర్తింపు లభించింది. ప్రపంచంలోని ప్రముఖ గ్లోబల్ స్కూళ్లతో బెంచ్‌మార్క్ చేయబడిన నిరంతర నాణ్యత మెరుగుదల వ్యవస్థను ఇనిస్టిట్యూట్‌లో కలిగి ఉందని హామీ ఇచ్చే లేబుల్ ఈ ప్రతిష్ఠాత్మకమైన అక్రిడేషన్‌తో లభించినట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది. హైదరాబాద్‌లోని ఐదు బి–స్కూళ్లలో శివశివాని ఇనిస్టిట్యూట్ ఉండటం వల్ల ఒక ప్రత్యేకమైన విజయంగా హర్షం వ్యక్తం చేశారు.

## ■ ముగిసిన ఇంజినీర్స్ స్టూడెంట్స్ ఫోరం ప్రాంతీయ సదస్సు

సదస్సులో పాల్గొన్న విద్యార్థులతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

దుండిగల్, జూన్22: నగరశివారు, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(ఎంఎల్‌ఆర్‌ఐటీ)కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన 'ఇంజినీర్స్ స్టూడెంట్స్ ఫోరం'(ఐడీయేట్, ఇన్నోవేట్, ఇగ్నైట్) ప్రాంతీయ సదస్సు–2కే24 శనివారం ముగిసింది. కళాశాలకు చెందిన విద్యార్థులు ఇంజినీర్స్ వితౌట్ బోర్డర్స్(ఈడబ్ల్యూబి)స్టూడెంట్ చాప్టర్ బాడీ, ఇండో యూనివర్సల్ కోలాబరేషన్ ఫర్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్(ఐయూసీఈఈ)చే నిర్వహించిన ఈ ముగింపు కార్యక్రమానికి కళాశాల ఫౌండర్ సెక్రెటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతీయ ఫోరమ్ నిర్వహణతో సమకాలీన సవాళ్లను, వినూత్న పరిష్కారాలను అన్వేషించడానికి , చర్చించడానికి ఉపయోగపడుతుందన్నారు. అంతకు ముందు విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్ నమూనాల నుంచి అత్యుత్తమ ప్రాజెక్ట్‌ను ఎంపిక చేసి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 150కి పైగా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఎంఎల్‌ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.శ్రీనివాసరావు, స్మార్టర్ ధర్మ కోఫౌండర్ కార్తీక్ పొన్నప్ప, స్టార్ట్ అప్ అడ్వైజర్ మనోజ్‌కుమార్, ఎంఎల్‌ఆర్ఐటీ కళాశాల డీన్ డా, వీ.రాధికాదేవి, ఫ్యాకల్టీ కోఆర్డీనేటర్లు మహేందర్, హారిక తదితరులు పాల్గొన్నారు.

## పలు కోర్సుల్లో బ్యాక్‌లాగ్స్ రాసేందుకు వన్‌టైమ్ చాన్స్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 22: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిన విద్యార్థులకు వన్‌టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థులకు ఈ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 10లోగా, రూ. 300 అపరాధ రుసుముతో 12వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతోపాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పరీక్షలను ఆగస్టులో నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని, వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

## ఎంఈ, ఎంటెక్ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఓయూ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ పరీక్షలకు సంబంధించి రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ అధికారులు తెలిపారు. రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఫలితాలను www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

## ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రిషి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఇంజినీరింగ్ పదవ బ్యాచ్ 'గ్రాడ్యుయేషన్ డే'ను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పట్టాలు అందించారు. అనంతరం హెచ్‌సీయూ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ జిలానీ, కళాశాల కరస్పాండెంట్ రాజశ్రీ మాట్లాడుతూ.. తదుపరి ఉన్నత విద్యను అత్యంత క్రమశిక్షణతో పూర్తి చేసుకుని చక్కని ఉద్యోగాల్లో రాణించాలన్నారు. డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. – మియాపూర్, జూన్ 22